

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

జ్యోతి కలశ్ ఛల్కే
హుయే గులాబీ, లాల్ సునహరే
రంగ్ దల్ బాదల్ కే.

జ్యోతి కలశం వొలికింది లేక తొణికింది. ఆ జ్యోతి కలశం తొణకటంవల్ల రంగురంగుల వెలుగు కిరణాలు జగమంతా విస్తరించాయి. జగతిని రంగులమయం చేశాయి. ఆకాశంలోని మేఘాలు గులాబీరంగునుండి, కాషాయ వర్ణంలోకి ఇతర పలు విభిన్నమైన వర్ణాలలోకి మారాయి.

'బాభీకీ చూడియా' అనే సినిమాలో సుధీర్ ఫాడ్కే సంగీత దర్శకత్వంలో పండిత నరేంద్రశర్మ రచించగా, లతా మంగేష్కర్ తన ఆత్మతో ఆలపించిన అత్యద్భుతమైన గీతం ఇది. హిందీ సినీ సంగీత జగత్తులో అత్యుత్తమమూ, అత్యద్భుతమూ, అత్యంత సుందరమూ అయినది అనగానే మనసులో మెదిలే గీతం ఇది. నిజానికి గీతం, గేయం, భజన, కవిత వంటి మామూలు పదాలకు అతీతమైన మరో పదాన్ని ఈ గానాన్ని వినే అనుభవాన్ని వర్ణించేందుకు, ఈ పాటను సూచించేందుకు సృజించాల్సి ఉంటుంది.

సామాన్యులు, కళాకారులు నివసించేది ఒకటే ప్రపంచం. వారు అనుభవించేవీ ఈ ప్రపంచంలోని అనుభవాలే. కానీ తమ అనుభవాలను 'కళ' రూపంలో ప్రదర్శించేవారు కళాకారులు. అది సంగీతం కావచ్చు, చిత్రలేఖనం కావచ్చు, రచనలు కావచ్చు. కళ ఏదైనా వారు తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, దానిలోని అనుభవాలను తమదైన దృష్టితో చూసి, అర్థం చేసుకుని తమ 'కళ'లో ప్రదర్శిస్తారు. వారు ప్రదర్శించే కళ వారు దర్శిస్తున్న ప్రపంచాన్ని ఎంత నిజాయితీగా, ఎంత దగ్గరగా ప్రదర్శిస్తే, ఆ 'కళ' అంత గొప్పదవుతుంది. ఆ గొప్ప కళ సమాజంపై ప్రభావం చూపిస్తుంది. వ్యక్తులలో నిద్రాణమై ఉన్న సున్నిత భావనలకు జీవం పోస్తుంది. అంటే, కళాకారుడు కళాసృజనను ఏవేవో అద్భుతమైన లోకాలనుంచి తీసుకురాడన్నమాట. ఓ మహానుభావుడన్నట్టు 'The greater the art the greater is the faithful reproducing capacity of the artiste!' అంతే. స్వకపోల కల్పన అన్నది మన అహంకారం ఆధారంగా సృజించిన పదం. ఏ కళాకారుడు కూడా ఈ జగతిలో లేనిది సృజించలేడు. ఈ విశ్వంలో ఉన్నదానికి అతి దగ్గరగా ఉన్నది ఉన్నట్టు సృజించటం కళాకారుడి అత్యుత్తమ నైపుణ్యానికి నిదర్శనం అన్నమాట. ఈ నిజాన్ని నిరూపిస్తుందీ పాట.

సూర్యోదయం సమయంలో ఆకాశంలో పలు రంగులు వెదజల్లినట్టుంటాయి. మేఘాలు పలు విభిన్నమైన వర్ణాలతో అలంకరించిన పుష్పాలలా ఉంటాయి. అత్యంత అద్భుతమైన దృశ్యం అది. రోజూ జరిగే సూర్యోదయమే అయినా ఒకరోజు మరో రోజులా ఉండదు. ఎన్ని సూర్యోదయాలు దర్శించినా ప్రతి సూర్యోదయం ప్రత్యేకమైన దర్శనానుభవాన్ని కలిగిస్తుంది. అలాంటి ప్రత్యేకమైన దర్శనానుభవంలోని సార్వజనీనతను కవి అత్యంత అద్భుతంగా వర్ణిస్తున్నాడు. సూర్యోదయం అయిందనటానికి బదులుగా జ్యోతి కలశం తొణికిందంటాడు. ఇక్కడే కవి సృజనాత్మకత స్పష్టమవుతుంది. ప్రతివారికీ సూర్యోదయంతో జగతి వెలుగుమయం అవుతుందని తెలుసు.

కానీ ఈ వెలుగుమయం అవటాన్ని జ్యోతి కలశం వొలకటంగా చూపటంలో కళాకారుడి సృజనాత్మక ప్రతిభద్యోతకమవుతుంది. అందరూ చూసే దానిలోనే ప్రత్యేక కోణాన్ని దర్శించి, అందరికీ తోచని విధంగా, వైవిధ్యంగ దాన్ని ప్రదర్శించటమే సృజనాత్మకత. 'సూర్యోదయమయింది. వెలుగు ఆకాశంలో విస్తరించింది. మేఘాలు రంగురంగులు ధరించాయి' అని చెప్పటం మాములు కానీ 'జ్యోతి కలశం తొణికింది' అని చెప్పటం కవిత్వం. ఉత్తమ స్థాయి కవిత్వం. 'జ్యోతి కలశ ఛల్‌కే' అనగానే హృదయం పులకరిస్తుంది. శరీరం ఆనందమయం అవుతుంది. మాటలకు, ఉత్తమ కవిత్వానికి తేడా స్పష్టమవుతుంది.

ఘర్, ఆంగన్, వన్, ఉపవన్, ఉపవన్

కరత్ జ్యోతి అమృత్ కే సించన్

మంగళ్‌ఘట్ ఢల్‌కే

వొలికిన జ్యోతి కలశం ఇంటిని, వాకిలిని, వీధులను, పూదోటలను, భూమిపైని అణువణువునూ అమృతమయం చేస్తోంది. అద్భుతమైన భావన. ఈ చరణం వినగానే ఒక్కసారిగా ఉపనిషత్తులలోని సూర్యోదయ వర్ణనలు, సూర్యుడిని దైవంగా భావించి చేసిన వ్యాఖ్యానాలు మనసులో మెదులుతాయి. సకల జీవుల ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని సూర్యుడు తూర్పున ఉదయించాడంటుంది ఉపనిషత్తు. గమనిస్తే, ఇది నిజం! మన భూమికి శక్తి నిచ్చేది సూర్యుడు. సూర్యకిరణాలలోనే ప్రాణం దాగి ఉంది. అంటే సూర్యకిరణాలు ప్రసరిస్తున్న చోట అంతా ప్రాణాన్ని చిలకరిస్తున్నట్టే. ఆ ప్రదేశాలను అమృతమయం చేస్తున్నట్టే. కవి ఇదే అంటున్నాడు. అద్భుతమైన పవిత్ర భావన మనస్సులో మెదులుతుంది.

పాత్ పాత్ బిర్వా హరియాలా

ధర్‌తీ కా ముఖ్ హువా ఉజాలా

సచ్ సప్నే కల్‌కే

సూర్యకిరణ శక్తితో ఆకులు పత్రహరితాన్ని తయారు చేసుకుంటాయి. ప్రపంచం హరితవనం అవుతుంది. కిరణాలు పరచుకోవటంతోటే చీకటి అదృశ్యం అవుతుంది. అంతవరకూ చీకటిలో ఉండి కనబడనివి ప్రకటితమవుతాయి. అందుకే కవి 'ధర్తీ కా ముఖ్ హువా ఉజాలా' అంటున్నాడు. భూమి వదనం పై వెలుతురు పడుతోందట. వెలుతురు వల్ల రేపటి కలలు నిజమౌతాయన్న ఆశాభావం వ్యక్తపరుస్తున్నాడు కవి. మరో రోజు ఆరంభమయింది. అంటే, ఆశ చిగురించినట్టే. వసుంధర వదనం వెండి వెలుగులతో తళతళలాడుతున్నప్పుడు ఇక ఆనందానికి కొదువ ఏముంటుంది?

ఉషానే ఆచల్ ఫైలాయా

ఫైలీ సుఖ్ కీ శీతల్ ఛాయా

నీచే ఆచల్ కే

సూర్యోదయాన్ని 'ఉషారాణి'గా వేదం అభివర్ణిస్తుంది 'ఉషోదయం' అన్న పదం సూర్యోదయానికి పర్యాయపదంగా వాడతారు .ఆ ఉషారాణి తన కొంగును పరచిందట. ఆ కొంగు క్రింద జగతికి చల్లని సుఖపు నీడ లభించిందట. ఎంత అద్భుతమైన ఊహ. తల్లి తన కొంగు చాటున బిడ్డను దాచి ఎండవేడి తాకకుండా చల్లదనం ఇచ్చినట్టు, జగతిని కష్టాల ఎండల నుంచి కాపాడుతూ చల్లదనాన్ని అందిస్తోందన్నమాట ఉషాదేవి.

అంబర్ కుం కుం కణ్ బర్సాయే

ఫూల్ పంకుడియోం పర్ మస్కాయే

బిందు తుహిన జల్‌కే....

ఆకాశం కాషాయ వర్ణపు కణాల వర్షాన్ని కురిపిస్తోందట. పూరేకులపై మంచు బిందువు నవ్వుతోందట. భావం మామూలుగా అనిపిస్తుంది. కానీ కవి వాడిన పదజాలం భావానికి ఉదాత్తతను ఆపాదిస్తోంది. పదాల ద్వారా కవి సృజించే దృశ్యానికి ఔన్నత్యాన్ని ఆపాదిస్తున్నాయి. అత్యత్తుమ స్థాయి పదాలు. 'బిందు తుహిన జల్' మంచునీటి బిందువు... ఈ సందర్భంలో కవితకు భాషకు ఉన్న అవినాభావ సంబంధం అర్థమవుతుంది. కావ్య వస్తువు ఉన్నతమూ, ఉదాత్తము అయినప్పుడు భాష కూడా అంతే ఉదాత్తమూ, ఉన్నతమూ అయినప్పుడే కవిత ప్రభావం అధికమౌతుంది. అలాకాక, ఉత్తమమూ, ఉన్నతమూ అయిన భావాన్ని మామూలు భాషలో చెపితే, భావం అదే అయినా దాని ప్రభావం తీవ్రత తగ్గుతుంది. ఇందుకు చక్కని నిదర్శనం ఈ పాటలోని పదాలు.

జ్యోతి యశోదా ధర్తీ గయ్యా

నీల్ గగన్ గోపాల్ కన్హయ్య

శ్యామల్ ఛవి ఛల్‌కే...

ఇక్కడ కవి తన ఊహను, తాను దర్శించిన దృశ్యాన్ని జగతిలో కనబడుతున్న దానిపై ఆరోపించి ఒక అత్యద్భుతమైన ఆధ్యాత్మిక భావనను ప్రదర్శిస్తున్నాడు. ఇంతవరకూ పరోక్షంగా ప్రదర్శించిన దైవ భావనను ఇప్పుడు ప్రత్యక్షం చేస్తున్నాడు. జ్యోతి అందరికీ జీవం పోస్తోంది. సుఖాన్నిస్తోంది. చల్లదనాన్ని ఇస్తోంది. జగతిని ఆనందమయం, అమృతమయం చేస్తోంది. ఎలాగయితే తల్లి తన పిల్లలకు జన్మనిచ్చి, ప్రేమించి, పెంచి, పిల్లలు సుఖంగా ఉండేందుకు అన్నీ అమర్చి సర్వం త్యాగం చేస్తోందో, 'జ్యోతి', 'వెలుగు' ఆ పని చేస్తోంది. అందుకే 'జ్యోతి' యశోద అయింది. అయితే, శిశువుకు పాలు ఇవ్వటం నుంచి అవసరమైనవి అందించే 'ఆవు'లాంటిది భూమి. భూమిపై వృక్షాలు మొలుస్తాయి. అంటే ఆహారాన్ని అందిస్తోంది కాబట్టి, 'జ్యోతి' యశోదలాంటి తల్లి అయితే, భూమి ఆవులాంటిది. మరి కృష్ణుడు 'నీల గగనం' విశ్వమంతా వ్యాపించి ఉన్నాడు.

'జ్యోతి కలశ ఛల్‌కే' పాటలో పదాలు చదువుతూ, భావాన్ని అనుభవిస్తూంటే ఇది మామూలు గేయం కాదని అర్థమవుతుంటుంది. అత్యద్భుతమైన కవితాత్మను, ఆధ్యాత్మికతను తనలో పొదుగుకున్న మహాద్భుతమైన కవిత ఇది అనిపిస్తుంది. ఈ కవితను రాసింది పండిత నరేంద్రశర్మ. పండిత నరేంద్రశర్మ అతి తక్కువ సినిమా పాటలు రాశారు. కానీ రాసినవన్నీ అత్యద్భుతమైన కవితలు. సాహిత్యపరంగా అత్యత్తుమ స్థాయిలో ఉండి సినీపాటల విలువను పెంచినవే. అందుకే రాజ్‌కపూర్ పై కోపం వచ్చి 'సత్యం శివం సుందరం' సినిమా పాటలు పాడనని భీష్మించుకుని కూర్చున్న లతామంగేష్కర్, ఆ సినిమా శీర్షిక పాట పండిట్ నరేంద్ర శర్మ రాస్తున్నాడని తెలియగానే, ఎలాంటి అహం చూపకుండా వెంటనే పాటలు పాడేందుకు ఒప్పుకుంది. దీనికి ప్రధాన కారణం, పండిత నరేంద్రశర్మ గీతం పాడటం ఒక రకమైన గౌరవం. అతను రచించిన కవితను గానం చేయటం అంటే, చరిత్రలో సుస్థిరమైన కీర్తిని, ఉత్తమస్థాయి పురస్కారాన్ని పొందటం లాంటిదని లతామంగేష్కర్‌కు తెలుసు. ఎందుకంటే లతా మంగేష్కర్ జీవితంలోనే కాదు హిందీ సినీగీతాల ప్రపంచంలో 'జ్యోతి కలశ్ ఛల్‌కే' పాటకు అత్యత్తుమ స్థానం లభిస్తుంది.

పండిట్ నరేంద్రశర్మ 'బాభీకీ చూడియా'లో, ఈ కవిత రాసినప్పుడు నిర్మాత మనసులో ఎలాంటి ఆలోచనలు మొదలయాయోగానీ, దాదాపుగా సంస్కృత భాష అనిపించే శుద్ధ హిందీలో ఉన్న అత్యత్తుమమైన ఆలోచనలను, భావాలను అతి గొప్పగా ప్రదర్శించే ఈ పాట కమర్షియల్ సినిమాల పరిధిలోకి ఒదగదనో, అందరూ మెచ్చరనో, సామాన్య ప్రేక్షకులకు అర్థం కాదనో కొట్టివేయకుండా, పాటను సినిమాలో వాడుకున్న నిర్మాత సంస్కారానికి జోహార్లు అర్పించాలనిపిస్తుంది. లేకపోతే, ఈనాడు ఈ అతి అమూల్యమైన వజ్రం ప్రజలకు అందేదికాదు.

ఈ పాటకు సుధీర్ ఫడ్కే బాణీని కూర్చిన తీరు అతని సృజనాత్మక ప్రతిభకు దర్పం పడుతుంది. కవిత ఎంత పవిత్రమో, ఉన్నతమో, అంతే పవిత్రమూ, ఉన్నతమూ, సందర్భోచితం అయిన రాగంలో పాటను కూర్చాడు సుధీర్‌ఫడ్కే.

భారతీయ సంగీతం అత్యంత శాస్త్రీయమైనది. ఏరాగం ఎలా పాడాలో, ఎప్పుడు పాడాలో, ఎప్పుడు పాడితే ఏ ప్రభావం ఉంటుందో, పరిశోధించి, విశ్లేషించి ఏర్పాటయింది భారతీయ సంగీతం. నిజానికి మానవజీవితం సర్వం వాయుసంచలనంపై ఆధారపడి ఉంటుంది. వాయుచలన నియంత్రణ ఆధారంగా ఆరోగ్యాన్ని సాధించటం 'యోగశాస్త్రానికి' దారి తీసింది. మనం మాట్లాడటమూ వాయు సంచలనంపై ఆధారపడివుంటుంది. పలికే శబ్దాలు కూడా వాయుసంచలనాన్ని నిర్దేశిస్తాయి. శరీరంపై ప్రభావం చూపిస్తుంది. దీని ఆధారంగా పరిశోధనలు జరిపి ఏయే అక్షరాలను ఎలా ఉచ్చరిస్తే ఎలాంటి ప్రభావం కలుగుతుందోనని విశ్లేషించటం వల్ల ఓ వైపు 'మంత్రశాస్త్రం' ఏర్పడితే మరోవైపు 'సంగీత శాస్త్రం' ఏర్పడింది. అందుకే 'అద్వైత సిద్ధికి, అమరత్వ లబ్ధికి గానెమె సోపానమూ' అంటారు 'సంగీతం' భగవంతుడిని చేరుకునే మార్గం అయింది. అందుకే ప్రతి రాగానికీ అది పాడవలసిన విధానం, పాడాల్సిన సమయం నిర్దేశితమై ఉన్నాయి. హిందుస్తాని సంగీతంలో ఉషోదయంలో సాధారణంగా భోపాలిరాగం, దేశ్‌కార్ రాగాలను వాడతారు. రెండు చాలా దగ్గరగా ఉండే రాగాలు. భోపాలి, భూపాలి, భూప్ రాగంగా ప్రసిద్ధి పొందింది. భోపాలి రాగంలో కాస్త అజాగ్రత్తగా ఉంటే అది మరో రాగంలోకి మారిపోతుంది. భోపాలి కానీ దేశ్‌కార్ కానీ శాంతిని, ప్రశాంతతని కలిగించే రాగాలు. ఉషోదయ కాలం నాటి స్వచ్ఛతను పవిత్రతను ప్రతిబింబిస్తూ, అత్యంత సౌఖ్యాన్ని ఆనందాన్ని కలిగించగల రాగాలు. అందుకే సంగీత దర్శకుడు 'జ్యోతి కలశ ఛల్‌కే' పాటను ఈ రెండు రాగాల నడుమ నడిపాడు. ఈ పాట భోపాలి రాగానికి ఉదాహరణగా కొందరు చూపితే, దేశికార రాగమని ఇంకొందరంటారు. రాగం ఏదయినా పాట ప్రభావం మాత్రం అత్యంత అద్భుతం. పాటను రూపొందించిన విధానం పరమాద్భుతం. ఆరంభంలోనే పక్షుల కలకలరావాలు పాటకు జోడించటంతోటే అది సూర్యోదయ సమయం అన్న ఆలోచన కలుగుతుంది. ఆ వెంటనే లతా మంగేష్కర్ దివ్య స్వరం ఆలాపన అందుకోవటంతోటే గుండె ఝల్లుమంటుంది. ఆనంద కెరటం ఎగిసిపడుతుంది. చీకటిని తరుముతూ, ఆకాశంలో వెలుగు రేకలు ఉద్భవించగానే హర్షాతిరేకంతో సకల ప్రాణకోటి హృదయాలు ఒక్క గొంతుతో ఆనందంతో చేసే ఆలాపన అది అనిపిస్తుంది. 'భూపాల రాగం దాటి దేశనార్' పొలిమేరల్లో విహరించే ఈ ఆలాపన జగతిపై వెలుతురును దర్శించిన తొలి మానవుడి గుండెను చీల్చుకు వచ్చి ఆనందపుటాలాపన అనిపిస్తుంది. ఆనాటి నుండి ఈనాటివరకూ ప్రతి ప్రాణి హృదయం ప్రతి ఉషోదయ సమయానికి ఆలపించే ఆనందగానాన్ని ప్రతిధ్వనిస్తున్నట్టుంటుంది లత ఆలాపన.

కవిత అత్యద్భుతం. బాణీ అతి మధురం. ఇక లత గానం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఉషారాణి అమృతం చిలికితే, ఆ అమృతం తాగి జీవం పోసుకుని ఆ అమృతత్వాన్ని తన స్వరంలో చిలికించి ప్రపంచానికి పంచుతున్నట్టుంటుంది లత స్వరం. ప్రతి పదాన్ని పలికే విధానంలోనే ఆ పదంలో దాగున్న పవిత్రతను ప్రస్ఫుటం చేస్తూ, హృదయానికి హత్తుకుని, మెదడులో స్థిరపడే రీతిలో పాడగలిగే ఏకైక గాయని లతా మంగేష్కర్. మామూలు పాటలనే అత్యద్భుతంగా తీర్చిదిద్దగల లత ఇలాంటి పాటలు దొరికితే తన గాన ప్రతిభ విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంది. పాటలోని ప్రతి పదం జీవంతో తొణికిసలాడుతూ, అమృతత్వంతో అలరారుతూ, ఆనంద మహా సముద్ర ఉత్తుంగ తరంగంలా అనిపించేట్టుంటుంది లత గానం.

సినిమా ప్రధానంగా దృశ్యమాధ్యమం. పాట రచన ఎంత గొప్పగా ఉన్నా, దానికి సంగీతం సందర్భోచితంగా ఉండి, గానం పరమాద్భుతంగా ఉన్నా, ఆ పాట తెరపై చిత్రీకరణ సరిగా లేకపోతే పాట ప్రభావం తరిగిపోతుంది. ఎన్నో అత్యద్భుతమైన పాటలు వింటూంటే ఎంతో గొప్పగా అనిపిస్తుంది కానీ పాటలు తెరపై చూస్తూంటే అత్యంతనిరాశ కలుగుతుంది. అలాంటి పాటలు తరువాత వింటుంటే ఎంత తొలగించుదామన్నా తొలగని దృశ్య ప్రభావం వల్ల అంత గొప్పగా అనిపించవు. ఇందుకు భిన్నంగా 'బాభీకీ చూడియా' దర్శకుడు 'సదాశివ' కవితను ఆత్మతో అర్థం చేసుకుని, పాట బాణీని, వాయిద్యాల భావాన్ని ఆత్మతో దర్శించి, అత్యంత భావస్ఫోరకంగా అత్యంత పవిత్రంగా అత్యంత అద్భుతంగా చిత్రీకరించాడు పాటను సందర్భ పరిధిలో ఒదిగింపచేస్తూ కూడా పాటలో పొదిగిన అనంతమైన ఆధ్యాత్మిక భావనలను కానీ, అత్యద్భుతమైన భావాలను ఉదాత్తమూ, ఉత్తమమూ అయిన ఆలోచనలను ఏ మాత్రం

పలుచన చేయలేదు. పైగా పాటలోని 'జ్యోతి'కి ప్రధాన పాత్ర 'మీనాకుమారి' పాత్రను ప్రతీకగా చేస్తూ మొత్తం సినిమాకు ఆ పాత్ర ఎంత కీలకమో బోధపరుస్తూ, సినిమాలో ప్రధాన పాత్రలయిన వదినా మరదళ్ల అనుబంధం అందరికీ అర్ధమయ్యే రీతిలో ప్రదర్శించాడు. ఇందుకు 'అరవింద్ లాద్' కెమెరా పనితనం ఎంతో తోడ్పడింది.

పాట ఆరంభంలో prelude సంగీతం వస్తున్నప్పుడు సూర్యోదయ దృశ్యాలను, పక్షులు ఎగరటాన్ని చూపుతాడు ఆ పై గుడిగోపురాన్ని చూపిస్తాడు. తరువాతి దృశ్యంలో ఓ వైపు వెలుతురు, మరోవైపు చీకటిగా ఉన్న ఇంటిని చూపిస్తాడు. ఇంతవరకూ మామూలుగా ఉంటుంది. తెల్లారుతోంది అన్నది ప్రేక్షకుడికి తెలుస్తుంది. ఇంకా ఉదయాన్ని సూచిస్తున్న సంగీతం వస్తూండగానే చీకటిగా ఉన్న తలుపు తెరచుకుంటుంది. వెలుతురు చీకటిని తరుముతూ దూకుతుంది. అదే సమయానికి తలుపు తెరుస్తున్న ఓ వనిత కనిపిస్తుంది. రాగాలాపన ఆరంభమవుతుంది. గుండె ఝల్లుమంటుంది ఆ రాగాలాపనకు. రాగాలాపన ఉచ్చస్థాయికి వెళ్లేసరికి రోమాలు నిక్కపొడుచుకుంటాయి. ఉదయం ఇంత అద్భుతంగా, ఆనందంగా ఉంటుందా అన్న ఆలోచన కలుగుతుంది. ఆ వనిత వరండాలోకి వచ్చి సూర్యుడికి నమస్కరిస్తుంది. అప్పుడు ఆమె పై సంపూర్ణమైన వెలుతురు పడుతుంది. ఆమె ఆ ఇంటికి దీపం, వదిన మీనాకుమారి. అరసెకనులో జరుగుతుందిదంతా. కానీ ఈ అరసెకనులో కనపడిన దృశ్యాలు మాత్రం ఎంతో భావగర్భితమైనవి. ఉదయానే లేచి తలుపులు తెరచి ఇంట్లో వెలుగులు నింపే ఉషారాణిలాంటిది 'నాయిక' అని అర్ధమైపోతుంది. ఇక్కడినుంచి పాటలో రెండు అర్ధాలు గోచరిస్తాయి. ఒకటి పాటలో వెలుతురు గురించి కనబడే ఆధ్యాత్మకపుటాలోచనలు. రెండవది, వాటికి సమాంతరంగా, తెరపై వెలుతురుకు ప్రతీక అయిన నాయిక. ఇంటికి దీపం ఇల్లాలు, ఇల్లాలే ఇంటికి దైవం వంటి ఆలోచనలకు ప్రతీకగా మీనాకుమారి పాత్ర కనిపిస్తూంటుంది. సూర్యుడికి దండం పెట్టుకుని ఇంటి పనులు ప్రారంభిస్తుంది ఆమె. అంతలో అల్లరి పిల్లవాడు నిద్రలేచి వస్తాడు. భువికి, ఆకాశానికి ఉన్న సంబంధాన్ని ప్రతీకాత్మకంగా ఆ పిల్లవాడికి, ఆమెకూ నడుమ ఉందని అర్ధమయ్యే రీతిలో చూపిస్తాడు. 'వెలుతురు అమృతం చిలికిస్తోంది' అన్నప్పుడు నాయిక కళ్లాపి చల్లుతూ ఉంటుంది. ఆకాశం కాషాయరంగు కణాలు వర్షిస్తోంది. అప్పుడు నాయిక ముగ్గు వేస్తూంటుంది. పూల ముగ్గులు. పిల్లవాడినీ వేయమంటుంది. మామూలుగా ఇంట్లో జరిగే పనులలోని అంతరార్ధాన్ని ఆధ్యాత్మికతను ప్రస్ఫుటం చేస్తూంటుంది పాట చిత్రీకరణ. అంటే పాట వింటుంటే మనకు ఒక కోణంలో అర్ధమవుతుంది. తెరపై చూస్తూంటే సినిమా సందర్భం తెలుస్తుంది. కథ ముందుకు సాగుతోంది. వెలుగుకు ప్రతీకగా స్త్రీమూర్తి నిలుస్తోంది. ఎలాగయితే వెలుగు ప్రపంచానికి అమృతం పంచి, కష్టాలు దూరం చేస్తుందో, అలా స్త్రీమూర్తి అన్న భావన కలిగిస్తుంది చిత్రీకరణ. ఇక 'ప్రకృతి పచ్చదనంతో అలరారుతుంది' అన్నప్పుడు తులసికోటకు నీరుపోయటం, పిల్లవాడూ ఆమెతోపాటు తులసికోటకు నమస్కరించటం, ఉషాదేవి కొంగుపరచిందన్నప్పుడు ఆమె కొంగుని పరచి పిల్లవాడిని దగ్గరకి తీయటం, ఎవరూ విస్మరించలేని ప్రతీకలు. వంట ఇంట్లో దృశ్యం పరమ రమణీయం. పాతకాలం వారందరికీ చిరపరిచితం. ఈ సందర్భంలో యశోద కృష్ణుల ప్రసక్తి తీసుకురావటం వదిన, మరదుల నడుమ ఉన్న మాతృ - సంతాన సంబంధాన్ని ప్రదర్శిస్తుంది.

అత్యద్భుతమైన కళాప్రదర్శనకు తిరుగులేని నిదర్శనం ఈ పాట. ఈ పాట వింటూంటే, చూస్తూంటే అనంతమైన ఆనందకరమైన భావాలు చుట్టుముడతాయి. రోజూ ఉదయం ఈ పాట వింటుంటే రోజంతా తెలియని పవిత్రభావన మనస్సును ఆవరించి ఉంటుంది. రోజంతా ఆనందంగా గడుస్తుంది అంతేకాదు, ఉదయంపూట ఇలాంటి పాట వింటే, రోజంతా గుర్తుకు వస్తూ ఆనందం కలిగిస్తూనే ఉంటుంది. ఎలాంటి చీకాకులు, నిరాశలు, అవేశాలను దరిదాపులకు రానీయదు.

అయితే, ఇంత అత్యద్భుతమైన పాట, దేశంలోని ఇతర కళాకారులు, ముఖ్యంగా మన తెలుగు కళాకారులపై ఎలాంటి ప్రభావం చూపలేదా? అన్న సందేహం కలుగుతుంది. అయితే, ఇంత ఉన్నతమూ, ఉదాత్తమయిన గీతాన్ని కమర్షియల్ సినిమా పరిధిలో ఒదిగింప చేయటం కష్టమైన పని. కాబట్టి తెలుగు కళాకారులు ఈ పాట నుంచి స్ఫూర్తి పొందినా ప్రదర్శించలేదేమో అనుకుంటే పొరపాటు.

1980లో వచ్చిన 'మానవుడు - మహనీయుడు' సినిమాలో ఉషశ్రీ, 'జ్యోతికలష్ చల్కే' పాటకు ప్రతిధ్వనిలాంటి పరమ రమణీయమైన పాటను రాశాడు.

కాంతి కలశం తొణికిందా
దిగంత వనాంత వసంత వాకిటల
అమృత భావన చిలికిందా.

చక్రవర్తి సంగీత దర్శకత్వం వహించిన ఈ పాట సుశీల ఎంతో గొప్పగా పవిత్రంగా పాడింది.

తెరమరుగైన ప్రభాకర బింబం తిరిగి వెలిగిందా?
ఇగిరిపోయిన జీవన లతిక చిగురు తొడిగిందా?
ఈశ్వర వర కరుణా సుధారసమే ఏరై పొంగిందా?
జాలిగ నవ్వే సుమవనీ జనని పూవై విరిసిందా?

సాహిత్య పరంగా, గానం పరంగా అతిగొప్పగా ఉన్న ఈ పాట రమణీయమైనది. అయితే పాట సందర్భం, చిత్రీకరణలు సరిగ్గా లేకపోవటంతో మరుగున పడింది. దీనికి తోడుగా, దీనిలో ఇంటర్ల్యూడ్ సంగీతం అంత ప్రభావితంగా లేకపోవటం, హిందీ పాటలోని మృదుత్వం, లాలిత్యం తెలుగుపాటలోని పదాలలో ఉన్నా బాణీలో లేకపోవటం కూడా తెలుగు పాట ప్రభావాన్ని తగ్గించిన అంశాలు - అయితే ఈ రెండు పాటలు గమనిస్తే, సినీ పాటలలో సాహిత్యం లేదని, సినిమా సంగీతం సంగీతం కాదని కొట్టివేయటం పొరపాటు అనిపిస్తుంది. పలుకళల సమ్మిశ్రితమైన సినిమా ఆధునిక సమాజపు కళ అని దాన్ని విస్మరించటం తగదని అనిపిస్తుంది. మరికొన్ని సుప్రభాత గీతాలతో వచ్చేనెల కలుద్దాం.

*(మరికొన్ని పాటలతో వచ్చేనెల)*

Post your comments